

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

- హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు, జూన్ 22 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని, ఇందుకోసం శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 మోసపూరిత హామీలిచ్చి ప్రజలను తప్పుదారి పట్టించిందని, అధికారంలోకి వచ్చాక ఒక్కటీ సరిగా అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు అందించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇస్తున్నదన్నారు. అయితే మధ్యలో రెండుసార్లు భరోసా ఇవ్వలేదని, దీనిని రైతులకు అర్థమయ్యేలా చాటి చెప్పాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. తమను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రైతులు, ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎర్రబెల్లి పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల సీనియర్, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎర్రబెల్లి తొర్రూరు పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుండ నర్సయ్య, సర్వే రమేశ్ కుటుంబాలను పరామర్శించి, వారికి పార్టీ తరఫున సహాయ సహకారాలందిస్తానని భరోసా ఇచ్చారు.

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్




# బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషిచేయాలి
- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్
- స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం

కురవి, జూన్ 22 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో సీరోలు, కురవి మండలాల పార్టీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్యా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయని, అందుకోసం శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయడంలేదని ఆరోపించారు. సీఎం ఒక మాట, మంత్రులు ఇంకోమాట, ప్రజాప్రతినిధులు మరోమాట మాట్లాడుతున్నారన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కూర్చొని మంచి అభ్యర్థిని నిలబెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎక్కడున్నారో తెలియదని, వారికి పదవుల మీద ధ్యాస తప్ప ప్రజలపై లేదన్నారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, రోడ్లు తెగిపోయినా ఇప్పటికీ వాటికి మరమ్మతు చేయలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేశామని బాధపడుతున్నారని తెలిపారు. కేసులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్‌ను నమ్మినందుకు రైతులు అరిగోస పడుతున్నారని, బోనస్, భరోసా రావడం లేదని, కమీషన్లు ఇస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నదని రెడ్యా తెలిపారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట లాలయ్య, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఉమా పిచ్చిరెడ్డి, నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, సొసైటీ చైర్మన్లు దొడ్డ గోవర్ధన్ రెడ్డి, కొండపల్లి శ్రీదేవి, నామా సైదులు, నూతక్కి నర్సింహారావు, కత్తెరశాల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

*తెల్లబంగారం వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్లుగా పత్తిని సాగు చేసి నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా వాణిజ్య పంటలపై ఉన్న మోజుతో అదే బాటలో పయనిస్తున్నారు. పొలాల్లో భూసారం తగ్గిపోతుందని, ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి సాగు చేయొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతూ నష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. విత్తనాలు వేసిన తర్వాత ఒకటి, రెండు సార్లు కలుపు తీసి పురుగు మందులు పిచికారీ చేస్తే సరిపోతుందని, దాదాపు 20 రోజుల వరకు నీరు లేకున్నా పంట తట్టుకుంటుందని, మిగతా వాటితో పోలిస్తే మంచి దిగుబడి వస్తుందని పత్తి పంట వేసేందుకే శ్రద్ధ చూపుతున్నారు.* - నర్సంపేట, జూన్ 22



పత్తి పంట

# తెల్లబంగారం వైపే మొగ్గు..

**అప్పుల పాలైనా పత్తి సాగు వదలని రైతులు**

- సం'పత్తి' ఇస్తుందన్న ఆశతో సాగు
- నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి ఎక్కువ
- వాణిజ్య పంటలపైనే ప్రత్యేక దృష్టి
- పంట మార్పిడి చేయక కొని తెచ్చుకుంటున్న నష్టాలు


వాణిజ్య పంటలు పండించే రైతుల జీవితాలతో ప్రకృతి, దళారులు అంతా కలిసి చెలగాటమాడుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికొచ్చాక దానిని ఎలాగైనా అమ్ముకోవాలనుకున్న రైతుల అవసరాలను గమనించి ప్రైవేటు వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నట్టేట ముంచుతున్నాయి. ఎక్కువ దిగుబడి రావాలని గంపెడాశతో వ్యవసాయాధికారుల సూచనలను పెడచెవిన పెట్టి ఇష్టమొచ్చిన రీతిలో రసాయనిక ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాట ధర సైతం కల్పించకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

**జిల్లాలో 1,34,812ఎకరాల పత్తి సాగుకు అంచనా..**

వరంగల్ జిల్లాలో గత సంవత్సరం వానకాలంలో 1,20,166 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేపట్టినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతుండగా, 2025 వానకాలం 1,34,812 ఎకరాల పత్తి సాగుకు అంచనా వేశారు. ఈ యేడు పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. వాణిజ్య పంటలపై మోజును కొంత వరకు తగ్గించుకుంటేనే భవిష్యత్‌లో నిలదొక్కుకునే పరిస్థితి కన్పిస్తుందని నిపుణులు అంటున్నారు. ఈ ఏడాది యూఎస్-7067, యూఎస్-704, సాంకేత్, స్విఫ్ట్, రణధీర్, చంద్రాగోల్డ్, సదానంద్, సీసీహెచ్-369, నవనీత్, రాణా రకాలకు చెందిన 2,34,800 పత్తి విత్తన ప్యాకెట్లను అధికారులు అంటుబాటులో ఉంచారు.

**సులువైన పంట కావడం వల్లే..**

పత్తి పంట సాగు సులువు కావడంతో రైతాంగం ఎక్కువ మొత్తంలో దీనిపై దృష్టి పెడుతున్నది. విత్తనాలు వేసిన తర్వాత ఒకటి, రెండు సార్లు కలుపు తీసి పురుగు మందులు పిచికారీ చేస్తే సరిపోతుందంటున్నారు. నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి ఉంటుందని, 20 రోజుల వరకు నీరు లేకున్నా పంట ఏమాత్రం ఎండిపోదంటున్నారు. మిగతా పంటలతో పోలిస్తే ఈ పంట మంచి దిగుబడిని అందిస్తుందని పేర్కొంటున్నారు. భూమి స్థితిగతులను బట్టి కూడా ఈ పంటను రైతులు సాగుచేస్తున్నారని వ్యవసాయాధికారులు అంటున్నారు.



- మంత్రి అయినా ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు
- సొంత పార్టీ ఎమ్మెల్యేలపైనే విమర్శలు
- కొండా దంపతులపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో భేటీ
- గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన



# తీరు మారని కొండా

**ప్రతి విషయంలోనూ మంత్రి సురేఖ తీరు వివాదాస్పదమే**

వరంగల్, జూన్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ గ్రూపుల పంచాయతీ ఆ పార్టీ అధిష్ఠానం వద్దకు చేరింది. మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మురళీధర్‌రావుల వ్యవహారశైలి మారడం లేదని, ఇకపై సహించేది లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పార్టీలో గ్రూపులను తయారు చేయడం, సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిడి తేవడంపై గత అక్టోబర్‌లో అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఈసారి మాత్రం ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా కొండా మురళీధర్‌రావు ఇటీవల పోచమ్మమైదాన్ జంక్షన్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరిపై చేసిన విమర్శలతో పార్టీకి నష్టం జరిగిందని వివరించారు. ఈ అంశంపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ మరుసటి రోజు మంత్రి కొండా సురేఖ ఇదే తరహాలో మాట్లాడారని పేర్కొన్నారు. మంత్రి సురేఖ, ఆమె భర్త కొండా మురళీధర్‌రావు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేయడం లేదని, అత్యధిక ఎమ్మెల్యేలతో వారికి విభేదాలున్నాయని చెప్పుకొచ్చారు. మంత్రి సురేఖ బాధ్యతలు నిర్వహించే దేవాదాయ శాఖ విషయంలోనూ ఇటీవల వివాదాస్పద నిర్ణయాలను ప్రకటించారని, భద్రకాళీ ఆలయంలో బోనాల నిర్వహణ నిర్ణయంపై వరంగల్ నగరంలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వివరించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తనపై కొండా దంపతులు ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పరకాల నియోజకవర్గంలోని ప్రతి మండలంలో తమకు వ్యతిరేకంగా గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, ఈ ప్రక్రియతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరుగుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కొండా సురేఖ దంపతులతో ఎలాంటి సంబంధం లేని భూపాలపల్లి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్‌లో గ్రూపులను తయారు చేస్తున్నారని అక్కడి సెగ్మెంట్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పార్టీ అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం.

**మొదటినుంచీ ఇదే తీరు..**

కొండా సురేఖ మొదటినుంచీ వివాదాస్పదంగా ఉంటున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యేలు మీనాక్షీ నటరాజన్‌కు తెలియజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో జరిగిన వ్యవహారాలను వివరించారు. గత అక్టోబర్‌లో కాంగ్రెస్ పార్టీలోని గ్రూపుల మధ్య గొడవలు జరిగేలా చేశారని, మంత్రిగా ఉన్న కొండా సురేఖ పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హంగామా చేశారని గుర్తుచేశారు. ఈ అంశం పరకాల నియోజకవర్గంలో పార్టీకి బాగా నష్టం చేసిందని వివరించారు. అప్పుడు పార్టీ అధిష్ఠానానికి అన్ని విషయాలను వివరించామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని నొక్కి చెప్పారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల ఫిర్యాదుపై రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పందించినట్లు తెలిసింది. కొండా సురేఖ, ఆమె భర్త మురళీధర్‌రావు వ్యవహార శైలిపై పార్టీపరంగా విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. త్వరలోనే నివేదిక ఇచ్చేలా ఆదేశాలు ఇస్తామన్నట్లు తెలిసింది.

# మళ్లీ పెద్దపులి కలకలం

**రాంపూర్ అడవుల్లో సంచరిస్తున్నట్లు అనుమానం**

కృష్ణకాలనీ, జూన్ 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మళ్లీ పెద్దపులి కదలికలు కలకలం సృష్టిస్తున్నాయి. భూపాలపల్లి అటవీ రేంజ్ పరిధిలోని కమలాపూర్, రాంపూర్ అడవుల్లో ఆదివారం పులి సంచరించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం కొయ్యూరు పరిధిలోని ఎడ్లపల్లి అడవిలో ఓ ఆవుపై దాడి చేసిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి కమలాపూర్ మీదుగా రాంపూర్ అడవిలోకి వెళ్లినట్లు అనుమానించిన అటవీ అధికారులు ఈ మేరకు పాదముద్రలు సైతం గుర్తించారు. కాగా, రాంపూర్, కమలాపూర్ అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అనుమానం ఉన్నందున ప్రజలు అటు వైపు వెళ్లొద్దని రేంజ్ అధికారి నరేశ్ సూచించారు.



అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

# ఇందిరమ్మ ఇండ్లు మాకొద్దు..

**వదులుకుంటున్న ములుగు జిల్లా కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులు**

- ఇప్పుడు కట్టుకోలేమంటూ అధికారులకు దరఖాస్తులు
- అదే బాటలో వెళ్లాలని యోచిస్తున్న ఇతర నాయకులు
- స్థానిక ఎన్నికల్లో అభాసుపాలవుతామని గుబులు
- తతంగమంతా ప్రజలు గమనిస్తున్నారని ఆందోళన
- పార్టీ క్రమశిక్షణా చర్యలతో వెనుకడుగు



ములుగు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇల్లు

ములుగు, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : స్థానిక సంస్థల ఎన్నికల వేళ ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులకు ఇందిరమ్మ ఇండ్ల భయం పట్టుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులకు దగ్గరుండి మంజూరు చేయించుకున్న నేతలు ఇప్పుడు తమ నిర్ణయాన్ని మార్చుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మాకొద్దంటూ అధికారులకు లేఖలు సమర్పిస్తున్నారు. తమ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారనే ఆందోళన ఒకవైపు.. పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందనే గుబులు మరోవైపు ఉండడంతో వెనకడుగు వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మంగపేట మండలం బుచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కాటూరి నాగయ్య ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయిస్తానంటూ పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డాడు. దీంతో మంత్రి సీతక్క ఆదేశాలతో పార్టీ మండలాధ్యక్షుడు అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇది మరువక ముందే ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తన తమ్ముడి భార్య పేరుపై మంజూరు చేయించిన ఇందిరమ్మ ఇల్లు వద్దంటూ శుక్రవారం ఎంపీడీవోకు లేఖ అందించారు. జిల్లాలో ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి కాకుండా కాంగ్రెస్ నేతలు, వారి బంధువులు, అనుచరులకు మంజూరు చేయించారని ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వెళ్తే ప్రజలు ఎక్కడ నిలదీస్తారోననే భయంతోనే సదరు నాయకుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాగా, ఇతడి బాటలోనే జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లు తమ వారికి ఇప్పించుకున్న నాయకులు ఎంచుకున్నట్లు చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం తమ తతంగాన్ని గమనిస్తున్న ప్రజలు రచ్చ రచ్చ చేస్తే మంత్రి చర్యలు తీసుకుంటుందనే భయంతోనే వారిని ఏమార్చేందుకు ఈ దారిలో వెళ్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ములుగు ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలోని ఓ మహిళ ఈ నెల 20న ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా లేనని, తన మంజూరు పత్రాన్ని రద్దు చేయాలని దరఖాస్తు ఇచ్చిందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఏది ఏమైనా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమకు ఓటుతో బుద్ధి చెబుతారనే ఆందోళనతోనే నేతలు ఇలాంటి నిర్ణయానికి వచ్చారనే చర్చ జరుగుతున్నది. అయితే ఇలాంటి కుయుక్తులను ప్రజలు నమ్ముతారా? లేక ఓటుతో బుద్ధి చెబుతారా? అనేది వేచి చూడాల్సిందే.



పిచ్చి మొక్కలతో నిండిన లక్నవరం కోట కాల్వ

# సాగునీరు అందేదెలా?

**అధ్వానంగా లక్నవరం ప్రధాన కాల్వలు**

గోవిందరావుపేట, జూన్ 22 : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు ప్రధాన కాల్వలు అధ్వానంగా మారాయి. ప్రతి కాల్వకు సీసీతో నిర్మించిన సైడ్ వాల్స్ పగలడం, కాల్వల్లో పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు పెరగడంతో వాటి ఆనవాళ్లు గుర్తుపట్టని పరిస్థితి నెలకొంది. ఏటా ఇదే దుస్థితి ఉంటుండడంతో నీరు ఆయకట్టు రైతుల పంట పొలాలకు అందకుండా పోతున్నది. అక్కడక్కడా గండ్లు కూడా పడుతున్నాయి. లక్నవరం సరస్సు కింద ప్రధానంగా నాలుగు పంట కాల్వలున్నాయి. ఇందులో నర్సింహుల 1, 2 కాల్వల కింద 3,150, కోటా 1,950, శ్రీరాంపతి 1,100, రంగాపూర్ కాల్వ కింద 2,600, మొత్తంగా 8,700 ఎకరాలు అధికారికంగా, మరో 4 వేల ఎకరాల్లో అనధికారికంగా సాగవుతున్నది. ఈ కాల్వలకు గత యాసంగిలో ఐబీ అధికారులు ఏర్పాటు చేసిన షట్టర్లు సక్రమంగా అమర్చకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే సైడ్ వాల్ లేకపోవడంతో బలుసుల మాటు వద్ద ఏటా గండ్లు పడుతుండగా రైతులు ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



సమావేశంలో చర్చిస్తున్న భద్రకాళీ దేవాలయ పాలక మండలి సభ్యులు

# రూ.కోటితో 'భద్రకాళీ'కి రథం

- కంచి కామాక్షి అమ్మవారి నమూనాలో తయారీ
- పాలక మండలి తొలి సమావేశంలో తీర్మానం

వరంగల్, జూన్ 22 : భద్రకాళీ అమ్మవారికి రూ.కోటితో రథం తయారు చేయించాలని పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం భద్రకాళీ ఆలయంలో నిర్వహించిన తొలి సమావేశంలో కంచి కామాక్షి అమ్మవారి రథం నమూనాలో తయారు చేయించాలని నిర్ణయించారు. మాడ వీధులు నిర్మాణం శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఇకపై అమ్మవారికి వాహన, రథ సేవలన్నీ అక్కడే నిర్వహించనున్నారు. దీనిని టేకుతో తయారు చేయించాలని, ఈమేరకు ప్రభుత్వం నుంచి అనుమతులను జారీ చేయించేలా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలను పాలక మండలి కోరింది. నిత్య పూజాకాలంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఉచిత ప్రసాద వితరణ చేయాలని ఇందుకోసం శాశ్వత నిధి ఏర్పాటుచేయాలని నిర్ణయించగా భక్తులు విరాళాలు ఇవ్వాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.

**26 నుంచి శాకంబరీ ఉత్సవాలు**

ఈ నెల 26 నుంచి జూలై 10 తేదీ వరకు శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విస్తృత ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో ఆలయ ఈవో శేషుభారతి, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీశ్, మొతుకూరి మయూరిరామేశ్వర్‌రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు పార్నంది నర్సింహమూర్తి, ప్రధాన అర్చకుడు శేషు పాల్గొన్నారు.

- గడువు ముగియడంతో హడావుడిగా చేపట్టిన కాంట్రాక్టర్లు
- నాణ్యతను పరిశీలించని ఇంజినీరింగ్ అధికారులు
- అడ్డగోలుగా రూ. కోట్ల బిల్లుల చెల్లింపులు
- సీడీఎంఏకు ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు



రంగశాయిపేట నుంచి ఉర్సు వరకు పుట్‌పాత్‌లపై కుంగిపోయిన టైల్స్

# స్మార్ట్‌కు తూట్లు!

**బల్దియాలో నాసిరకంగా స్మార్ట్ సిటీ పనులు**

వరంగల్, జూన్ 22 : స్మార్ట్ సిటీ పనులను కాంట్రాక్టర్లు అడ్డగోలుగా చేస్తున్నా బల్దియా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. నాణ్యత లోపిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. స్మార్ట్ సిటీ పథకం గడువు ముగియడంతో హడావుడిగా పనులు చేస్తూ కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారు. పురోగతిలో ఉన్న పనులు పూర్తిచేయాలని స్మార్ట్ సిటీ అధికారులు చెప్పడంతో ఇదే అదనుగా బల్దియా అధికారులు, కాంట్రాక్టర్లు మిలాఖత్ అయి నాసిరకపు పనులతో అందినకాడికి దోచుకుంటున్నారు. గవిచర్ల క్రాస్ రోడ్డు నుంచి ఉర్సు, కరీమాబాద్ మీదుగా ఎస్ఎస్ఆర్ తోట జంక్షన్ వరకు వేసిన స్మార్ట్‌రోడ్డు ఇరుపక్కలా పుట్‌పాత్‌పై టైల్స్‌ను అధ్వానంగా వేస్తున్నారు. నెల రోజులు గడవక ముందే టైల్స్ కుంగిపోవడం, పగిలిపోవడం జరుగుతున్నాయి. దీనిపై స్థానిక న్యాయవాది, ప్రజాసంఘాల నాయకులు ఏకంగా సీడీఎంఏకు ఫొటోలతో సహా లేఖ రాసినా బల్దియా అధికారులు స్పందించ లేదు. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జీడబ్ల్యూఎంసీ కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్ అయినా స్మార్ట్ సిటీ పనులపై దృష్టిసారిస్తారేమోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



పుట్‌పాత్‌లపై దెబ్బతిన్న టైల్స్

**అసంపూర్తిగా పనులు**

స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన అనేక పనులు అసంపూర్తిగా మిలిగిపోయాయి. నిర్దేశిత గడువు ముగిసినా పనులు పూర్తి కాలేదు. గవిచర్ల మీదుగా ఎస్ఆర్ఆర్ తోట వరకు వేసిన స్మార్ట్ రోడ్డు, పుట్‌పాత్ పనులు మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పుట్‌పాత్‌పై వేస్తున్న టైల్స్ పనులు మరో ఆరు నెలలైనా పూర్తయ్యేలా కనిపించడంలేదు. పోతన బైపాస్ రోడ్డులో చేపట్టిన నాలా విస్తరణ పనులదీ అదే పరిస్థితి. ఇప్పుడు వర్షాలు పడితే రామన్నపేట, పోతననగర్, సంతోషిమాతకాలనీ, సాయినగర్ నీటి మునిగే అవకాశాలున్నాయి. స్మార్ట్ పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే పూర్తిచేసిన పనుల నాణ్యతను పరిశీలించకుండానే రూ. కోట్ల బిల్లులు చెల్లించారనే ఆరోపణలు గత కమిషనర్, ఎస్ఈపై వెల్లువెత్తుతున్నాయి. చిన్న పనులను పరిశీలించి నాసిరకంగా ఉంటే బిల్లుల్లో కోత పెట్టిన కమిషనర్లు స్మార్ట్ సిటీ పనులకు సంబంధించి హడావుడిగా, అడ్డగోలుగా చెల్లించారనే గుసగుసలు ఇంజినీరింగ్ విభాగంలో వినిపిస్తున్నాయి. పెద్ద కాంట్రాక్టర్లు రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చి దర్జాగా రూ. కోట్ల బిల్లులు తీసుకున్నారనే చర్చ బల్దియాలో జోరుగా సాగుతున్నది. కొత్త కమిషనర్ దీనిపై దృష్టిసారించి బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని, అసంపూర్తి పనులను పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.